


గత టీడీపీ ప్రభుత్వ హయాంలో..

వాస్తవంగా టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ బోర్డు నిధుల నుంచి కార్మికుల ఆపద సమయాల్లో ఎంతో కొంత చెల్లించే వారు. కార్మికుల కుటుంబాల్లో ఆడపిల్లల రెండు కాన్పులకు రూ.30 వేల చొప్పన ఆర్థికసాయం చేసేవారు. ఆడపిల్లల వివాహాలకు రూ.20 వేలు ఇచ్చేవారు. కార్మికుడు ప్రమాదవశాత్తూ గాయపడితే చికిత్స అందిస్తూ రూ.4,500 అందించేవారు. సహజ మరణమైతే ఆ కుటుంబానికి కార్మిక సంఘం నిధులతో రూ.80 వేలు అందించే వారు. ప్రమాదవశాత్తూ మరణిస్తే.. రూ.5 లక్షలు ఆర్థికసాయంగా ఇచ్చేవారు. చంద్రన్న కిట్‌ల పేరిట మేస్త్రీలకు తాపీ, గజం, సుత్తి, శానాం, లైన్‌తాడు తదుపరి సామగ్రి పంపిణీ చేసేవారు. వైసీపీ సర్కారు వాటికి మంగళం పాడేసింది. పాలనా పగ్గాలు చేపట్టిన వెంటనే ఆ నిధులను తన సొంతానికి వాడుకుంది. దీనిపై అప్పట్లో జిల్లాలో భవన నిర్మాణ కార్మికులు, సంఘ నాయకులు నిరసన కార్యక్రమాలు చేపట్టినా సర్కారు స్పందించలేదు.

- ఇసుక కొత్త పాలసీ విధానంతో అన్నీ ఇబ్బందులే..
- మందగించిన నిర్మాణాలు.. పనుల్లేక విలవిల్లాడిన భవన నిర్మాణ కార్మికులు
- దూర ప్రాంతాలకు వలసలు
- సంక్షేమ బోర్డు నిధుల దారి మళ్లించిన వైసీపీ
- ఆందోళనలు చేపట్టినా స్పందించని సర్కారు





ఉపాధికి దూరం చేశారు..

పొట్టకొట్టారు

(పార్వతీపురం- ఆంధ్రజ్యోతి/భామిని)

ఉపాధి కల్పనలో భవన నిర్మాణ రంగం ఎంతో కీలకం. అయితే వైసీపీ అధికారంలోకి రాగానే ఈ రంగం కుదేలైంది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఇసుక కొత్త పాలసీ విధానం నిర్మాణాలపై తీవ్ర ప్రభావం చూపింది. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఇసుక ధర అనేక రెట్లు పెరిగిపోయింది. కొన్నిచోట్ల సామాన్య, మధ్యతరగతి వర్గాలకు ఇసుక దొరకని పరిస్థితి ఏర్పడింది. దీంతో నిర్మాణాలు మందగించాయి. భవన నిర్మాణ కార్మికులు, అనుబంధ కూలీలు ఉపాధికి దూరమయ్యారు. ఇదే సమయంలో ఎంతో మంది కార్మికులు జిల్లా నుంచి వలసబాట పట్టారు. ఏదేమైనా టీడీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల పాటు కళకళలాడిన నిర్మాణ రంగం.. వైసీపీ అధికారంలోకి రాగానే కుప్పకూలింది.

ఇదీ పరిస్థితి..

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇసుక ఉచితం. ఈ విధానం నిర్మాణ రంగానికి ఎంతో ఊతమిచ్చింది. అప్పట్లో లోడింగ్, రవాణా, ఖర్చులతో ఇసుక ట్రాక్టర్ రూ.2వేలకు లభించేది. 20 టన్నుల ఇసుక లారీ రూ.10వేలు ఉండేది. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చాక సీన్ మారింది. ఈ ధర అనేక రెట్లు పెరిగింది. ప్రస్తుతం ట్రాక్టర్ ఇసుక ధర రూ.4వేల పైమాటే. వాస్తవంగా 2019, సెప్టెంబరులో వైసీపీ సర్కారు ఇసుక పాలసీ కొత్త విధానం తెచ్చింది. దీనివల్ల ఇసుక ధర తగ్గలేదు. అక్రమ తవ్వకాలు, రవాణా ఆగలేదు. మరోవైపు కరోనా మహమ్మారి భవన నిర్మాణ రంగంపై తీవ్ర ప్రభావం చూపింది. ఇసుక కొత్త పాలసీని తీసుకురావడంలో వైసీపీ ప్రభుత్వం కాలయాపన చేయగా..ఆ పార్టీ నేతలకు అదే కలిసొచ్చింది. అప్పటికే కొనసాగుతున్న నిర్మాణాలకు ఇసుక కరువవగా.. దానిని కొందరు వైసీపీ నేతలు సొమ్ము చేసుకున్నారు. మొత్తంగా వారికి కొత్త ఇసుక విధానం బంగారంగా మారింది. నిర్మాణాలు చేపట్టేవారికి మాత్రం జేబులు గుల్ల చేసింది. వైసీపీ సర్కారు తీరుతో స్థానికంగా ఉపాధి దొరక్క ఎంతోమంది వలసబాట పట్టారు. ఇళ్లకు తాళాలు వేసుకుని కుటుంబాలతో సహా పొరుగు రాష్ట్రాలు, మహా నగరాలకు తరలివెళ్లారు.

- ఉమ్మడి జిల్లాలో భవన నిర్మాణ కార్మికులు 1,34,931 మంది ఉన్నారు. వారిలో తాపీ మేస్త్రి, కూలీలతో పాటు రాడ్ బెండింగ్, సెంట్రింగ్, ఎలక్ట్రీషియన్, ప్లంబర్, టైల్స్ మేస్త్రి ,పెయింటర్ తదితరు లు ఉన్నారు. అయితే వైసీపీ వచ్చాక వారికి ఉపాధి కరువైంది. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో అమలైన ఉచిత ఇసుక విధానంపై తీవ్ర విమర్శలు చేసినజగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త పాలసీ విధానం తీసుకొచ్చి తొలి ఆరు నెలల పాటు ఎక్కడా ఇసుక దొరక్కుండా చేశారు. మరోవైపు కరోనా మహమ్మారి భవన నిర్మాణ రంగంపై తీవ్ర ప్రభావం చూపింది. ఈ సమయంలోనూ వైసీపీ సర్కారు భవన నిర్మాణ కార్మికులను ఆదుకోలేదు.

సంక్షేమ బోర్డు నిధులు పక్కదారి..

గత టీడీపీ ప్రభుత్వం భవన కార్మికుల సంక్షేమానికి కేటాయించిన రూ.1200కోట్లను వైసీపీ సర్కారు రద్దు చేసింది. జీవో నెంబర్ 12, 14 అమలు చేసి సంక్షేమ పథకాలను కార్మికులకు అందకుండా చేసింది. కార్మికుల బోర్డు నిధులను సైతం వైసీపీ సర్కారు దారి మళ్లించింది. దీంతో... మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు పరిహారం కూడా అందడం లేదు.

నింగినంటిన మెటీరియల్ ధరలు..

వైసీపీ సర్కారు పాలనలో గృహ నిర్మాణ మెటీరియల్ ధరలన్నీ నింగినంటాయి. ఇసుక, ఇటుక, సిమెంట్, పిక్కరాయి ఐరన్ తదితర వాటి ధరలు అమాంతం పెరిగాయి. గతంలో 2 వేల ఇటుక ధర రూ.4 వేల వరకు ఉండేది. అయితే వైసీపీ పాలనలో అదే ఇటుకకు రూ. 8 వేల నుంచి రూ.10 వేల వరకు చెల్లించాల్సి వస్తోంది. ఇటుక బట్టీలకు సంబంధించి దగ్గరలో ఉన్న మట్టి తెచ్చుకునేందుకు గతంలో ఎటువంటి సొమ్ము చెల్లించనవసరం ఉండేది కాదు. కానీ వైసీపీ వచ్చాక నగదు చెల్లించాల్సి వస్తోంది. దీంతో ఇటుక ధర రెట్టింపయ్యింది. సిమెంట్ విషయానికొస్తే.. గత టీడీపీ ప్రభుత్వంలో బస్తా ధర రూ.250 నుంచి రూ.300 వరకు ఉండేది. వైసీపీ వచ్చాక అదే సిమెంట్ బస్తాను రూ.350 నుంచి రూ.380 వరకు విక్రయిస్తున్నారు. గతంలో స్లాబ్ కంకర ట్రాక్టర్ ధర రూ.3 వేలు ఉండగా.. ఇప్పుడు దాని ధర రూ.5వేలకు



చేరింది. ఇలా మెటీరియల్ ధరలన్నీ పెరిగిపోవడంతో సామాన్య, మధ్య తరగతి వర్గీయులు నిర్మాణాలు చేపట్టలేని పరిస్థితి ఏర్పడింది. కొంతమంది తమ నిర్మాణాలను వాయిదా వేసుకోవడంతో భవననిర్మాణ కార్మికులు పనులకు దూరమయ్యారు.

జిల్లాలో రీచ్‌లు ఇలా..

జిల్లాలో అనుమతులు పొందిన ఇసుక రీచ్‌లు 30 వరకూ ఉన్నాయి. అయితే ఆయా రీచ్‌ల్లో కాకుండా ఇతర ప్రాంతాల్లో కూడా కొంతమంది ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు చేపట్టారు. అక్రమంగా ఇతర ప్రాంతాలకు రవాణా చేశారు. కొమరాడ మండలం కోనేరు రామభద్రపురం వద్ద రీచ్‌లో పరిధికి మించి తవ్వకాలు చేపట్టడంతో అధికారులు దాని అనుమతులు రద్దు చేశారు. కానీ ఉమ్మడి జిల్లాకు చెందిన ఒక వైసీపీ నేత పేరు చెప్పుకొని ఆ ప్రాంతంలో అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపట్టారు. కొమరాడ మండలంలో దుగ్గి, శిఖవరం, కోటిపాం, గంగరాయవలస ప్రాంతాల్లో మాత్రమే ఇసుక రీచ్‌లను అధికారంగా గుర్తించారు. అయితే అనధికారికంగా చాలాచోట్ల తవ్వకాలు జరిపారు. సమీప తోటల్లో ఇసుకను డంప్ చేసి రాత్రి వేళల్లో ఇతర ప్రాంతాలకు తరలించి కొంతమంది రెండు చేతులా సంపాదించారు. పార్వతీపురం నియోజకవర్గంలో సీతానగరం మండలం పానుకుపేట, పెదంకలం బూర్జ, పెదబోగలి, లక్ష్మీపురం, చినబోగిలి ప్రాంతాల్లోని సువర్ణముఖి నదిలో, గరుగుబిల్లి, పాచిపెంట, సాలూరు, మక్కువ, బలిజిపేట తదితర మండలాల్లోనూ అనధికారికంగా ఇసుక తవ్వకాలు చేపట్టారు. ఐదేళ్లుగా ఈ దందా జోరుగా సాగినా.. పట్టించుకునే వారే కరువయ్యారు. ఎవరైనా గృహ నిర్మాణాలకు ట్రాక్టర్లపై ఇసుక తెచ్చుకుంటే.. కేసు నమోదు చేశారు తప్ప అక్రమంగా తవ్వకాలు జరిపి ఇసుకను తరలించిన వారిపై జిల్లా అధికారి యంత్రాంగం పెద్దగా కేసులు నమోదు చేయలేదనే ఆరోపణలున్నాయి.

- భామిని మండలంలో వంశధార నదీతీరాన ఉన్న ఇసుకకు అనేక అడ్డంకులు సృష్టించడంతో భవన కార్మికులకు ఉపాధి లేక రోడ్డున పడ్డారు. గతంలో అనేక పర్యాయాలు వామపక్షాలతో కలిసి వారు ఆందోళనకు దిగినా .. వైసీపీ సర్కారు పట్టించుకోలేదు.
- కొత్త పాలసీ విధానంతో వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన తొలినాళ్లలో ఇసుక దొరికేది కాదు. దీంతో ప్రజలు చాలా అవస్థలు పడాల్సి వచ్చేది. ముందుగా మీ సేవలో చలానాలు తీసుకున్నా.. ఇసుక లభించడం కష్టంగా ఉండేది. ఎందుకంటే అనధికార , అధికార రీచుల వద్ద వైసీపీ నాయకుల హవా కొనసాగేది. దీంతో ఇసుక తెచ్చుకోవాలంటే చలానాలతో పాటు రీచ్‌ల వద్ద ముడుపులు చెల్లించుకోవాల్సిన పరిస్థితి మొదటి ఏడాదిలో ఉండేది. మొత్తంగా వైసీపీ సర్కారు నూతన ఇసుక విధానంతో భవన నిర్మాణ కార్మికుల పొట్ట కొట్టింది. వారికి ఉపాధిని దూరం చేసి వలసబాట పట్టేలా చేసింది. మరోవైపు నిర్మాణాలు చేపట్టేవారిపై సైతం పెనుభారం మోపింది.

ఈ పరిస్థితి ఎప్పుడూ చూడలేదు..

కొన్నేళ్లుగా నేను భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్నాను. కనీసం పది మంది తాపీమేస్త్రీలు నా దగ్గర పనిచేసేవారు. అయితే ఇప్పుడున్న పరిస్థితి ముందెన్నడూ చూడలేదు. టీడీపీ హయాంలో ఇసుక అందుబాటులో ఉండేది. నిర్మాణాల మెటీరియల్ ధరలు కూడా తక్కువగానే ఉండేవి. దీంతో నిర్మాణాలు జోరుగా సాగేవి. మా ఉపాధికి ఇబ్బంది ఉండేది కాదు. అయితే వైసీపీ వచ్చాక ఇసుక కోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితి. గతంలో ఎన్నడూ ఈ పరిస్థితి లేదు. ఇసుక, ఇతర నిర్మాణ సామగ్రి ధరలు అమాంతం పెరిగిపోవడంతో పనులు నిలిచిపోయాయి. మాకు ఉపాధి కరువైంది. ఎంతోమంది భవన నిర్మాణ కార్మికులు పనుల కోసం పొట్టచేతపట్టుకుని ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిపోయారు.

-తిరుపతిరావు, తాపీమేస్త్రి, పార్వతీపురం

వలస బాటలోనే..

స్థానికంగా ఉపాధి లేకపోవడంతో అనేక మంది భవన నిర్మాణ కార్మికులు ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో ఇసుక అందుబాటులో లేకపోవడం వల్ల మాలాంటి భవన నిర్మాణ కార్మికులు ఉపాధి లేకుండాపోయింది. వలస బాట పట్టాల్సిన దుస్థితి ఏర్పడింది.

-వెంకటరమణ, భవన నిర్మాణ కార్మికుడు, పార్వతీపురం

పథకాలకు మంగళం..

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో భవన నిర్మాణ కార్మికులకు అందించిన సంక్షేమ పథకాలన్నింటినీ వైసీపీ సర్కారు మంగళం పాడేసింది. చివరకు సంక్షేమ బోర్డు నిధులను సైతం దారి మళ్లించింది. ఇసుక దొరక్కుండా చేసి మాకు ఉపాధి లేకుండా చేసింది.

-అప్పలస్వామి, భవన నిర్మాణ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు, భామిని

వైసీపీని ఓడిద్దాం

- అరాచక పాలన అంతం.. కూటమి పంతం
- ఎన్డీఏ కూటమి నాయకుల పిలుపు

పార్వతీపురం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీని ఓడించడమే లక్ష్యంగా పనిచేయాలని ఎన్డీఏ కూటమి నాయకులు పిలుపునిచ్చారు. వైసీపీ సర్కారు అరాచక పాలన అంతం.. కూటమి పంతం అని తెలిపారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎన్డీఏ చార్జిషీట్ కరపత్రాలను బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, జనసేన నాయకుడు బాబుతో కలిసి టీడీపీ పార్వతీపురం నియోజకవర్గ అభ్యర్థి బోనెల విజయచంద్ర విడుదల చేశారు. ఈ సందర్భంగా విజయచంద్ర మాట్లాడుతూ.. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం సర్వనాశనమైందన్నారు. అరాచక పాలనకు మంగళం పాడడమే లక్ష్యంగా మూడు పార్టీలు కలిసి.. వైసీపీపై యుద్ధం చేస్తున్నట్టు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం 14 లక్షల అసైన్‌మెంట్ భూములను కబ్జా చేసేందుకు ప్రయత్నిందని , పోలవరం నదులు అనుసంధానికి గండి కొట్టిందని ఆరోపించారు. రూ. 13 లక్షల కోట్లు అప్పు చేసి రాష్ట్రాన్ని దివాలా తీయించదని విమర్శించారు. పంచాయతీలు, మున్సిపాలిటీలకు చెందిన సుమారు రూ.12 వేల కోట్లను దారి మళ్లించిందని తెలిపారు. పెట్రోల్, డీజిల్‌పై వైసీపీ పన్నులను తగ్గించకుండా .. ప్రజలకు ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేసిందన్నారు. రాష్ట్రాన్ని గంజాయి, డ్రగ్స్ క్యాపిటల్‌గా మార్చిందని తెలిపారు. గ్రూప్-1 పరీక్షలను తారుమారు చేసి మెరిట్ యువత గొంతు కోసిందన్నారు. గత ఎన్నికల సమయంలో కోడికత్తి డ్రామాలాడి దళిత యువకుడిని జైలు పాలు చేసిన సీఎం జగన్.. తాజాగా గులకరాయి నాటకమాడి బీసీ యువకుడిని బలిచేశారని ఆరోపించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పార్వతీపురం నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి జోగారావు ఓటమే లక్ష్యంగా మూడు పార్టీలు కలిసి పనిచేస్తున్నాయన్నారు. ప్రజలు ఆవేదన ఏ విధంగా ఉందో ఓట్లు రూపంలో వైసీపీకి చూపిస్తారన్నారు. జనసేన నాయకుడు పి. బాబు మాట్లాడుతూ... రాష్ట్రంలో 175 నియోజకవర్గాల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి నుంచి ఒక అభ్యర్థి మాత్రమే పోటీ చేస్తున్న విషయాన్ని జగన్ గుర్తించుకోవాలన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు బి.సీతారాం, బి.చంద్రమౌళి, గౌరునాయుడు, టీవీ రమణ, జి.వెంకటనాయుడు, వి.దాలినాయుడు, భాను ప్రసాద్, జి.చం ద్రమౌళి, శివ తదితరులున్నారు.



మాట్లాడుతున్న కూటమి అభ్యర్థి విజయచంద్ర, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, జనసేన నేత బాబు

598 మంది టీచర్లకు నోటీసులు

- పాఠశాలల్లో వసతులపై వాస్తవాలను నమోదు చేయలేదనే కారణంతో జారీ
- మండిపడుతున్న ఉపాధ్యాయ సంఘాలు
- లేని సౌకర్యాలు ఉన్నట్టు ఎలా చూపించాలంటూ ప్రశ్నిస్తున్న నాయకులు
- వైసీపీ సర్కారు, ఉన్నతాధికారుల తీరుపై పెదవి విరుపు

పార్వతీపురం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 598 మంది ఉపాధ్యాయులకు శనివారం విద్యాశాఖ అధికారులు షోకాజ్ నోటీసులు అందించారు. కనీస సౌకర్యాలు లేని పాఠశాలలకు సంబంధించిన వాస్తవాలను ఏకీకృత జిల్లా సమాచార దరఖాస్తులో నమోదు చేయలేదనే కారణంతో నోటీసులు ఇచ్చారు. ఈ మేరకు 24 గంటల్లో సమాధానం ఇవ్వాలని ఆదేశించారు. అయితే దీనిపై యూటీఎఫ్ నాయకులు ఎస్.మురళీమోహన్‌రావు, తోట రమేష్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే నోటీసులను వెనక్కి తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ కార్యాలయ అధికారికి శనివారం సాయం త్రం వారు వినతిపత్రం అందించారు. పాఠశాలల్లో కనీస మౌలిక వసతుల లేకపోతే.. ఉన్నట్టు ఎలా ఉపాధ్యాయులు ధ్రువీకరిస్తారని ప్రశ్నించారు. పాఠశాలల్లో వాస్తవ పరిస్థితు లపై సమాచారం అందిస్తే .. ఉపాధ్యాయులు తప్పు చేసినట్టుగా షోకాజ్ నోటీసులు జారీ చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. జిల్లాలోని అనేక పాఠశాలల్లో ఇంటర్నెట్, తాగునీరు, మరుగుదొడ్లు తదితర సదుపాయాలు లేవని, దీనిపై వాస్తవ సమాచారాన్ని అందిస్తే.. విద్యాశాఖ ఉన్నతాధికారులు జీర్ణించుకోలేక పోతున్నారని అన్నారు. ఉపాధ్యాయులపై చర్యలు తీసుకొనేందుకు విద్యాశాఖ ఉపక్రమిస్తే తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు. షోకాజ్ నోటీసులకు వెంటనే సమాధానం ఇవ్వాలని ఉపాధ్యాయులపై ఒత్తిడి తేవడం చూస్తుంటే.. వైసీపీ ప్రభుత్వం ఇంకా తమను వేధించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టుగా ఉందని విమర్శించారు. తక్షణమే నోటీసులను వెనక్కి తీసుకోవాలని, లేదంటే పెద్దఎత్తు ఆందోళన చేస్తామని యూటీఎఫ్ నాయకులు హెచ్చరించారు.



నోటీసులు వెనక్కి తీసుకోవాలని డీఈవో కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నేతలు



మేనిఫెస్టోను నమ్మొచ్చా?

- వైసీపీ ఎన్నికల హామీలపై పెదవి విరుపు
- అనేక ప్రశ్నలు సంధిస్తున్న ప్రజలు

(విజయనగరం/పార్వతీపురం- ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర విభజన నేపథ్యంలో కేంద్రం ఉమ్మడి జిల్లాకు కేటాయించిన గిరిజన విశ్వ విద్యాలయాన్ని ఈ ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం పూర్తి చేయలేకపోయింది. పైగా వచ్చే ఐదేళ్లలో పూర్తి చేస్తామని ఈ మేనిఫెస్టోలో పేర్కొంది. టీడీపీ హయాంలో కేంద్రం మంజూరు చేసిన గిరిజన విశ్వ విద్యాలయాన్ని ఎక్కడ నిర్మించాలో తేల్చేందుకే మూడేళ్ల పట్టింది. తరువాత ముఖ్యమంత్రి శంకుస్థాపన చేసినా ఇంతవరకు అడుగు కూడా కదలలేదు. ప్రస్తుతం పరాయిపంచలో తరగతులు నిర్వహిస్తున్నారు. 91 మంది బోధనా సిబ్బంది అవసరం కాగా 18మంది ఉన్నారు. కొన్ని పీజీ గ్రూపులే ఉన్నాయి. హాస్టల్ సౌకర్యం లేని కారణంగా విద్యార్థులు చేరేందుకు వెనకంజ వేస్తున్నారు. ఉన్నతమైన వర్సిటీని ఈ ప్రభుత్వం అభాసుపాలుచేసింది.

- ప్రస్తుతం సామాజిక పింఛను రూ.3వేలు అందిస్తున్నారు. దీనికి అదనంగా రూ.250 చొప్పున రెండు విడతల్లో రూ.500కు పెంచుతున్నట్లు కొత్త హామీల్లో పేర్కొన్నారు. అంటే 2029 ఎన్నికలు దగ్గర పెంచేందుకు నిర్ణయించారా అని పేదలు ప్రశ్నిస్తున్నారు. టీడీపీ అధికారంలో వస్తే పింఛను మొత్తాన్ని రూ.4వేలు చేస్తామని చెప్పిన అంశాన్ని ప్రస్తావిస్తున్నారు.
- పాత పథకాలనే వచ్చే ఐదేళ్లలో కొనసాగిస్తామని పేర్కొన్నారు. చేయూత, కాపునేస్తం, ఈబీసీ నేస్తం, టైలర్లకు ఏడాదికి రూ. పది వేలు పథకాల్లో మార్పు లేదు.
- ఫిష్ ఆంధ్రా బేషుగ్గా అమలు చేసినట్లు పేర్కొన్నారు. కానీ ఉమ్మడి జిల్లాలోని పిష్ ఆంధ్రా యూనిట్లన్నీ మూలకు చేరాయి. వైఎస్ఆర్ అగ్రి టెస్టు ల్యాబ్‌లదీ ఇదే పరిస్థితి.
- గ్రూప్-1, గ్రూప్-2తో పాటు ఉద్యోగ నియామక పరీక్షలు క్రమం తప్పకుండా నిర్వహిస్తామని పేర్కొన్నారు. గతంలో కూడా ఇదే మాదిరిగా జాబ్ క్యాలండర్ అంటూ ఆశలు రేపి ఎన్నికల ఏడాదిలోనే కొద్దిపాటి ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చారు.
- వైఎస్ఆర్ జలకళ పథకానికి వేలాది మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. బోర్లు వేసినవి, విద్యుత్ కనెక్షన్లు ఇచ్చినవి చాలా తక్కువ. రిగ్ బోర్ యజమానులకు బిల్లులు చెల్లించని కారణంగా వారు మధ్యలో వెళ్లిపోయారు. మళ్లీ ఎన్నికల హామీల్లో ఈ పథకాన్ని వైసీపీ చేర్చింది.
- వచ్చే ఐదేళ్లలో మాత్రం సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్నారు. తోటపల్లి తదితర సాగునీటి ప్రాజెక్టుల పెండింగ్ పనులను చూస్తున్న ప్రజలు ఈ హామీని కూడా నమ్మడం లేదు.
- ఏటా రైతు భరోసా పేరుతో రూ.13500 అందిస్తున్నారు కానీ ఇందులో కేంద్రం అందిస్తున్న పీఎం కిసాన్ రూ.6వేలు కలిసి ఉంది. ఇది మినహాయిస్తే జగన్ అందిస్తున్నది కేవలం రూ.7500. అందుకే తాజాగా రైతు భరోసాను రూ.16వేలకు పెంచుతున్నట్లు పేర్కొన్నా ప్రజలు సందేహం వ్యక్తం చేస్తున్నారు.
- రైతులకు 9గంటల పాటు విద్యుత్‌ను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కానీ ఏడు గంటలు మాత్రమే అందిస్తూ తొమ్మిది గంటలుగా ప్రచారం చేస్తున్నారు. ఈ హామీని మళ్లీ చేర్చారు.
- జర్నలిస్టులకు 60శాతం రాయితీతో ఇళ్ల స్థలాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. గడిచిన ఐదేళ్లలో అందివ్వలేదు.
- ఆదరణ పథకం ద్వారా కుల వృత్తిల వారికి టీడీపీ పనిముట్లు అందించి జీవన ప్రమాణాలు పెంచింది. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత వీటిని ఎత్తివేశారు. తాజా ఎన్నికల హామీల్లో కుల వృత్తులకు ప్రాధాన్యమని చేర్చారు. కానీ ఎవరూ నమ్మడం లేదు.

వైసీపీ

ఎన్నికల మేనిఫెస్టో చూసి ప్రజలు పెదవి విరుస్తున్నారు. అమలు చేయనివి సైతం చేసినట్లు పేర్కొనడాన్ని తప్పుబడుతున్నారు. గిరిజన వర్సిటీకి మరో ఐదేళ్లు పడుతుందని మళ్లీ ఎలా చెప్పగలుగుతున్నారని మండిపడుతున్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగాలిస్తామన్న మాటను కూడా నమ్మడం లేదు. ఈ ఐదేళ్లలో జాబ్ కేలండర్ దుస్థితిని ఉదహరిస్తున్నారు. జలకళ, జలయజ్ఞం హామీలను కూడా ప్రజలు విశ్వసించడం లేదు.



పీపుల్స్ మేనిఫెస్టో

మార్కెటింగ్ సౌకర్యాలు మెరుగుపర్చాలి



సాలూరు రూరల్: రైతుల పంటలకు గిట్టుబాటు ధర లభించేలా మార్కెటింగ్ సౌకర్యాలు అందుబాటులో ఉండాలి. ప్రస్తుత మార్కెటింగ్ విధానాన్ని మెరుగుపర్చాలి. రైతుల పంటలకు మార్కెటింగ్ సౌకర్యాలు పూర్తిస్థాయిలో అందుబాటులో లేని పరిస్థితులు ఉన్నాయి. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఉన్నా సరిపోవడం లేదు. ప్రైవేట్ వ్యాపారులు చెప్పిన ధరలకు పంటను విక్రయించే పరిస్థితులు ఉన్నాయి. మార్కెటింగ్ సౌకర్యాలు మరింత విస్తృతం చేయాలి.

- సువ్వాడ రామకృష్ణ, రైతు, మామిడిపల్లి

అలా.. ఖర్చు తగ్గింది!



పార్వతీపురం, [illegible] నామినేషన్లు సమర్పించారు.

పార్వతీపురం కలెక్టర్ కార్యాలయం

అప్పట్లో రాజకీయాలు వేరు

పెద్దల మాట



మక్కువ: అప్పట్లో రాజకీయాలు స్నేహపూర్వక వాతావరణంలో ఉండేవి. మా గ్రామాల అభివృద్ధికి ఎవరు కృషి చేస్తారో ముందుగా చర్చించుకొని నిర్ణయం తీసుకొనేవారం. అభ్యర్థులు ఎవరైనా అందరితో కలిసి ఉండేవారు. కక్ష సాధింపు చర్యలు పెద్దగా ఉండేవి కావు. ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థి... ఓడిపోయిన అభ్యర్థి సహకారం తీసుకొని ముందుకు వెళ్లేవారు. ఎన్నికలు వస్తే గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొనేది. డబ్బులు తీసుకొనేవారం కాదు. పోటీ చేసే అభ్యర్థుల నీతి, నిజాయితీలే ఎన్నికల్లో గెలుపునకు కొలమానంగా ఉండేవి.

- పోలయ్య (83), డోకిశీల గ్రామం

పాపాలు గుప్పించి.. నట్టేట ముంచి!



ఎంతో మంది రైతులు.. కార్మికులకు ఉపాధినిచ్చిన భీమసింగి చెక్కర పరిశ్రమను వైసీపీ నాయకులు ఆధునికీకరణ పేరుతో మూసివేయించారు. దీంతో ఎంతో ఆశపడ్డ రైతులు ఉసూరుమంటున్నారు. మళ్లీ అధికారాన్నిస్తే దీన్ని లాభదాయకమైన పరిశ్రమగా మార్చేస్తామంటూ జిల్లాకు చెందిన వైసీపీ నాయకులు చెప్పడంపై రైతులు మండిపడుతున్నారు. దశాబ్దాల చరిత్ర కలిగిన ఈ పరిశ్రమ మూతపడడంతో వేలాది మంది ఉపాధిని కోల్పోయారు.

- మూతపడిన భీమసింగి చక్కెర పరిశ్రమ
- వైసీపీ నాయకుల మాటలకు మోసపోయిన రైతులు
- రోడ్డున పడిన కార్మికులు, ఉద్యోగులు
- ఆదాయం కోల్పోయిన అన్నదాత

(జామి)

ఉత్తరాంధ్రకే తలమానికంగా నిలిచిన విజయరామ గజపతి కోఆపరేటివ్ సుగర్స్ లిమిటెడ్ (భీమసింగి సుగర్స్) నేడు ఆనవాలు లేకుండా పోయింది. మండలంలోని కుమరాం గ్రామంలో కొన్ని దశాబ్దల కిందట గజపతిరాజుల వంశానికి చెందిన పీఎల్ఎన్ రాజు ఈ చెక్కర పరిశ్రమను స్థాపించారు. తరువాత కాలంలో స్వాతంత్ర్య సమరయోధుడు గొర్రిపాటి బుచ్చి అప్పారావు, లగుడు సింహాద్రి వంటి పెద్దలు దీనిని ఈ ప్రాంత రైతుల సాయంతో సహకార రంగంలోకి మార్పు చేయించారు.

లక్ష టన్నుల క్రషింగ్..

1967లో స్థాపితమైన ఈ ఫ్యాక్టరీ 1977 నుంచి క్రషింగ్ మొదలుపెట్టింది. ప్రారంభంలో విశాఖ, విజయనగరం జిల్లాలో 18 మండలాలకు చెందిన 3,500 మంది రైతులు ఈ కర్మాగారంలో 16,682 షేర్‌హోల్డర్స్ ఉన్నారు. 1250 టన్నుల కెపాసిటీతో క్రషింగ్ ప్రారంభమైంది. ఒకానొక దశలో లక్ష టన్నుల క్రషింగ్ జరిగిందటే ఈ ప్రాంత రైతులకు ఈ పరిశ్రమ ఎంత ఆదారమో చెప్పవచ్చు. ఎంతో మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఈ పరిశ్రమ ఉపాధి కల్పించింది. ఈ రెండు జిల్లాలకు చెందిన 543 గ్రామాల నుంచి చెరకు కర్మాగారానికి వచ్చేది. ఇక్కడ తయారైన పంచదారకు ఎంతో గిరాకీ ఉండేది. కాలక్రమంలో ఈ కర్మాగారం పరిస్థితి దయనీయంగా మారింది. ప్రస్తుతం విజయనగరం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి చెరకు వస్తుంటే 60వేల నుంచి 80వేల టన్నులు క్రషింగ్ జరుగుతుంది.

అధికారంలోకి వచ్చి మూయించారు

2019లో ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఒక సీజన్ నడిచింది. సుమారు 60వేల టన్నుల క్రషింగ్ జరిగింది. క్రషింగ్ పూర్తయిన వెంటనే జిల్లా మంత్రి, ఇద్దరు ఎమ్మెల్యేలు, ఎంపీల ఆధ్వర్యంలో మహాజన సభ ఏర్పాటు చేసి.. రైతులు, కార్మికులు నెత్తిన ఒక్కసారి పెద్దపిడుగులాంటి వార్త పడేశారు. భీమసింగి సుగర్స్ కర్మాగారానికి మహర్దశ రాబోతుందని 2020-21 సంవత్సరాల్లో రెండు క్రషింగ్‌లు నిలిపివేసి ఆధునీకరిస్తున్నామని చెప్పారు. వామపక్ష నాయకులు, లోక్‌సత్తా నాయకులు దీనిని ఖండించారు. వచ్చే క్రషింగ్‌కు కొత్త యంత్రాలు బిగించి క్రషింగ్ చేయాలని... దీనిని ఆపొద్దని కోరారు. అయినా సరే మంత్రి మాత్రం మీకు ఫ్యాక్టరీ అభివృద్ధి ఇష్టం లేదా? మీరు అభివృద్ధిని అడ్డుకుంటారా? అంటూ మండిపడ్డారు. మాటలు చెప్పిన మంత్రి, ఎమ్మెల్యేలు, ఎంపీలు ఆ తరువాత చేతులు ఎత్తేశారు. ఈ ఫ్యాక్టరీ ఆధునీకరణ మాట అటుంచి.. దీనిని పూర్తిగా మూలకు తోసేశారు.

మూతపడిన భీమసింగి చక్కెర కర్మాగారం (ఫైల్)


మాట తప్పను.. మడమ తిప్పనని..



ఈ ఫ్యాక్టరీని ఎన్ని ప్రభుత్వాలు వచ్చిన పెద్దగా పట్టించుకోకపోయినా రైతులు, కార్మికులు మాత్రం తమ శ్రమతో నడిపించేవారు. ప్రభుత్వాలు ఉమ్మతడిగా ఇచ్చే సొమ్మును పొదుపుగా వాడుతూ ఎప్పటికప్పుడు యంత్రాల నిర్వహణ భారాన్ని మోస్తూ..ముందుకు నడిపారు. 2019లో ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు చెరకు రైతులు, కార్మికులు ఆయనను కలిసి పరిశ్రమ దీనస్థితిని వివరించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఫ్యాక్టరీని ఆధునీకరించి, పూర్వవైభవం తెస్తామని మాట ఇచ్చారు. ఈ జగన్ మాట ఇస్తే మడమ తిప్పడు అంటూ.. పెద్దపెద్ద మాటలు చెప్పారు. ఆయన వెనుక ఉన్న గజపతినగరం, ఎస్.కోట ఎమ్మెల్యేలు బొత్స అప్పలనర్సయ్య, కడుబండి శ్రీనివాస్ తమదిరైతు ప్రభుత్వం.. మీ వెంటే మేము ఉంటాం అంటూ భరోసా ఇచ్చేశారు. జిల్లాకు చెందిన మంత్రి బొత్స సత్యనారాయణ వీరికి వంతపా డారు. ఇది గుడ్డిగా నమ్మిన రైతులు, కార్మికులు తమకు మంచి రోజులు వస్తాయని బలంగా నమ్మారు.

పట్టని కార్మికుల వేదన..

ఈ ప్రభుత్వ హయాంలో ఇక ఫ్యాక్టరీ తెరవదన్న అభిప్రాయానికి రైతులు, కార్మికులు వచ్చేశారు. నాలుగేళ్లపాటు వారికి ఎదురుచూపులు మిగిలాయి. రైతులు చెరకు పంట వేయడం మానేశారు. కార్మికుల్లో చాలామందికి 18 నెలలుగా జీతాలు రాక పస్తులతో ఇప్పటికీ ఇబ్బందులు పడుతున్నారు. ఇక రిటైరు అయిన వారికి ఇప్పటికీ పీఎఫ్, గ్రాట్యూటీ, ఇతర సెటిల్‌మెంట్స్ ఊసేలేదు. కొద్దిరోజుల క్రితం ఎన్నికల ప్రచారంలో మంత్రి బొత్సను ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు ఫ్యాక్టరీ భవితవ్యం గురించి ప్రశ్నిస్తే... ఇక ఫ్యాక్టరీ ఊసు మరచిపోవాలని.. మన పార్టీ వచ్చే ఎన్నికల్లో గెలిస్తే లాభదాయక పరిశ్రమగా మార్చనున్నట్టు తేల్చేశారు. దీంతో ఈ ప్రాంత రైతులు, కార్మికులు ఈ ప్రభుత్వం తమ ఉసురు పోసుకుందని, దీనికి తగిన మూల్యం తప్పదంటూ శాపనార్థాలు పెడుతున్నారు. ఎంతో ఘన చరిత్ర కలిగిన భీమసింగి చక్కెర కర్మాగారం చరిత్రను కాలగర్భంలో కలిపేశారని మండిపడుతున్నారు. ఈ ఫ్యాక్టరీ పరిధిలో ఉన్న విశాఖ, విజయనగరం ఎంపీలు, శృంగవరపుకోట, గజపతినగరం ఎమ్మెల్యేలు తమది నిరంతరం రైతు ప్రభుత్వం అని మాటలు చెబుతూ రైతులను మభ్యపెట్టడం తప్ప.. రైతులకు చేసిందేమీ లేదని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.



నష్టాలు లేకపోయినా.. మూసివేయడం దారుణం



నష్టాలు లేకుండా నడుస్తున్న భీమసింగ్ సహకార చక్కెర కర్మాగారాన్ని వైసీపీ అధికారంలోకి వచ్చాక మూసేయడం రాష్ట్ర చరిత్రలో తొలిసారి. రాష్ట్రంలో ఉన్న ఎన్నో సహకార కర్మాగారాలు నష్టాలతో మూతపడినా.. ఈ ఫ్యాక్టరీ మాత్రం రైతులు, కార్మికులు కలిసికట్టు నడిపించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆధునికీరణ పేరుతో మూసేయడం దారుణం. రెండేళ్లల్లో ఆధునీకరించి తెరిపిస్తామన్న మంత్రి బొత్స మాటలను రైతులు నమ్మి మోసపోయారు. పరిశ్రమ తెరిపించేందుకు అఖిలపక్షం ఆధ్వర్యంలో పోరాటం చేశాం.

- భీశెట్టి బాబ్జీ, భీమసింగి సుగర్స్ అఖిలపక్ష పోరాట నాయకుడు

రూ.5 కోట్లు ఇవ్వలేని చేతకాని ప్రభుత్వం



ఈ ఫ్యాక్టరీని వైసీపీ ప్రభుత్వం కావాలనే మూసివేయించింది. కేవలం రూ.5 కోట్లు ఉంటే ఈ ఫ్యాక్టరీకి పూర్వవైభవం వస్తుందని చెప్పిన వారికి ఈ నిధులు తెచ్చే దమ్ములేకపోయింది. గత టీడీపీ ప్రభుత్వం పరిశ్రమ అభివృద్ధికి నిధులు ఇచ్చింది. వాటిని వైసీపీ వచ్చాక వినియోగించకపోవడంతో వెనక్కి వెళ్లిపోయాయి. రైతులు, కార్మికుల ఉసురుపోసుకున్న మంత్రి, ఎమ్మెల్యేలకు తగిన గుణపాఠం చెప్పేందుకు రైతులంతా సిద్ధంగా ఉన్నారు. పరిశ్రమ పరిరక్షణ కోసం హైకోర్టులో కేసు వేసి పోరాటం చేస్తున్నాం.

- బండారు పెదబాబు, మాజీ జడ్పీటీసీ, జామి

నిను వీడని నీడను నేను..!

- అభ్యర్థుల ప్రచారంపై అధికారుల మూడో కన్ను

(శృంగవరపుకోట)

ఈ సార్వత్రిక ఎన్నికల సమయంలో ఓ నియోజకవర్గ అభివృద్ధిపై ఓ పత్రిక కథనం ప్రచురించింది. పెయిడ్ ఆర్టికల్‌గా ఎందుకు భావించకూడదో వివరణ ఇవ్వాలని ఓ పార్టీ అభ్యర్థికి అధికారులు నోటీసు అందించారు. రూ.2 లక్షలకు లెక్క కట్టారు. దీనికి సమాధానం ఇచ్చేందుకు ఆ అభ్యర్థి దిక్కులు చూస్తున్నారు.

.. అభ్యర్థులపై ఎన్నికల కమిషన్ నిఘా ఎలా ఉంటుందో చెప్పడానికి ఈ సంఘటన ఓ ఉదాహరణ. ఎన్నికలు వచ్చాయంటే ఊరూ వాడా ఒకటే ప్రచార జోరు. అభ్యర్థి వెంట కదిలే అనుచర గణం... కార్లు, ద్విచక్ర వాహనాలు, లౌడ్ స్పీకర్లు, టీవీలు, పత్రికల్లో .. ఒకటేంటి? ఎన్ని చిత్ర విచిత్రాలో ..ఇలా ప్రచారం చేసేందుకు పరిమితికి మించి ఖర్చు పెట్టేందుకు వెనుకాడరు. ఓటరును ప్రలోభ పెట్టేందుకు పెడుతున్న ఖర్చును లెక్క పెట్టేందుకు అధికారుల బృందం వీరిని అనుసరిస్తుంది. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం అభ్యర్థులు ప్రచారంలో వినియోగించే ప్రతి పైసాను లెక్కిస్తుంది. ఇలా మూడో కన్ను నిరంతరం నిఘా పెడుతుంది. అభ్యర్థుల ప్రతి కదలికను వీడియోల్లో బంధిస్తున్నారు. అభ్యర్థుల ప్రచారం ప్రారంభం నుంచి ముగిసే వరకు వీరి వెంటే ఉంటున్నారు. జిల్లాలో పార్లమెంటు, శాసన సభలకు జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం, వైసీపీల మధ్యనే ప్రధాన పోటీ. వీటితో పాటు ఇతర పార్టీలు, ఇండిపెండెంట్లు పోటీ చేస్తున్నారు. అభ్యర్థులంతా జోరుగా ప్రచారం చేస్తున్నారు. సభలు, సమావేశాలకు, జన సమీకరణలకు లౌడ్ స్పీకర్లకు వెచ్చించే ఖర్చును వ్యయ పరిశీలకులు లెక్కిస్తున్నారు. ఈ లెక్కలు అభ్యర్థి ఖర్చును దాటేస్తే ఆ ఎన్నిక చెల్లదంటూ ఎన్నికల సంఘానికి ప్రకటించే అధికారం ఉంది.



చీపురుపల్లి నుంచి 11 జాతీయ పార్టీలు

(చీపురుపల్లి)

మీకు తెలుసా

ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఏర్పాటైన చీపురుపల్లి నియోజకవర్గం.. వివిధ అసెంబ్లీ ఎన్నికల్లో 11 జాతీయ పార్టీలు పోటీలో నిలిచేందుకు వేదికైంది. జిల్లాలో మరెక్కడా లేని విధంగా చీపురుపల్లి అసెంబ్లీ నుంచి ఎక్కువ సంఖ్యలో జాతీయ పార్టీలు తమ అభ్యర్థులను పోటీకి నిలపడం విశేషం. ఈ 11 జాతీయ పార్టీల్లో కేవలం భారత జాతీయ కాంగ్రెస్ తప్ప మరే పార్టీ ఇక్కడ విజయం సాధించలేదు. 1972లో జరిగిన ఎన్నికల్లో భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థిగా రౌతు పైడపునాయుడును రంగంలోకి దించింది.

- 1978లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ (ఐ) పార్టీ చిగిలపల్లి శ్యామలరావును, భారత జాతీయ కాంగ్రెస్ కుచ్చర్లపాటి లక్ష్మీపతిరాజును, జనతా పార్టీ రౌతు పైడపునాయుడును పోటీలో నిలిపాయి.
- 1983లో జరిగిన ఎన్నికల్లో కూడా కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీ, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్)లు తమ వారిని ఎన్నికల్లో పోటీకి నిలిపాయి.
- 1985లో మాత్రం జాతీయ పార్టీ తరపున ఇక్కడ ఎవరూ పోటీ చేయలేదు.
- 1989లో లోక్‌దళ్ నుంచి దుగ్గిరాల కృష్ణకుమార్‌బాబు, జాతీయ కాంగ్రెస్ తరఫున మీసాల నీలకంఠం నాయుడులు పోటీ చేశారు.
- 1994లో కూడా కాంగ్రెస్, బీజేపీ, బహుజన్ సమాజ్ పార్టీలు వరుసగా కెంబూరి రామ్మోహనరావు, కోకా మాలతీదేవి, గుణుపూరు నరసింగరావులను తమ అభ్యర్థులుగా పోటీలో నిలిపాయి.
- 1999లో కాంగ్రెస్ తరఫున నీలకంఠంనాయుడు, రిపబ్లికన్ పార్టీ ఇండియా నుంచి దండి అప్పారావులు పోటీకి దిగారు.
- 2004లో కాంగ్రెస్ తరఫున బొత్స సత్యనారాయణ, బహుజన్ సమాజ్ పార్టీ నుంచి కిల్లి రాజమోహనరావులు పోటీ చేశారు.
- 2009లో తిరిగి భారత జాతీయ కాంగ్రెస్ బొత్స సత్యనారాయణను, బీజేపీ సాకేటి మోహనరావు ను, బహుజన సమాజ్ పార్టీ బైరెడ్డి అప్పలనాయుడును, రాష్ట్రీయ జనతాదళ్ పార్టీ పెందుర్తి వెంకటరావును పోటీలో నిలబెట్టాయి.
- 2014లో కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియాలు తమ అభ్యర్థులను నిలిపాయి.

2019లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జమ్ము ఆదినారాయణను, బీజేపీ శంకర్‌లాల్ శర్మను, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అమరా శ్రీదేవిని ఎన్నికల్లో నిలిపాయి.

ఇలా దాదాపు అర్ధ శతాబ్దం పాటు జాతీయ పార్టీలు చీపురుపల్లి నుంచి తమ అభ్యర్థులను పోటీకి దింపుతూ వస్తున్నాయి.



ఇన్నాళ్లకు ఓటొస్తోంది!

సీతంపేట: ఎన్నికల కమిషన్ నిర్ణయం ఓ మహిళకు ఓటు వేసే అవకాశం కల్పిస్తోంది. అదీ రెండు దశాబ్దాల తరువాత. దారపాడు పంచాయతీలోని రామానగరానికి చెందిన ఆరిక ప్రిరిషికల (38) దివ్యాంగురాలు. దీంతో ఎన్నికల సమయంలో ఓటు వేసేందుకు వెళ్లే అవకాశం ఉండేది కాదు. ఎవరూ పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లడానికి సహకరించే వారు కాదు. ఓటు వేయాలనే కోరిక బలంగా ఉన్నా... పరిస్థితులు సహకరించకపోవడంతో ఇన్నాళ్లూ దూరంగా ఉండిపోయేది. తాజాగా ఎన్నికల అధికారులు 80 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, వికలాంగులు ఇంటి వద్దనే ఓటు హక్కును వినియోగించుకొనేందుకు అవకాశం కల్పించారు. దీంతో ప్రిరిషికలకు ఓటు వేసేందుకు వీలు కలిగింది. దీనిపై ఆమె సంతోషం వ్యక్తం చేస్తోంది.

ఓటు హక్కు వచ్చిన ఆనందంలో ప్రిరిషికల



పల్లెల్లో అంతా గప్‌చుప్

(గరుగుబిల్లి)



ఎన్నికలు దగ్గర పడుతున్నాయి. మైకుల హోరును పక్కన పెడితే ఓటర్ల పరంగా గ్రామాల్లో నిశ్శబ్ద వాతావరణం కనిపిస్తోంది. ఒక పక్క పోటీలో ఉన్న అభ్యర్థులు ప్రచారంలో జోరు కనబరుస్తుంటే... పల్లె ఓటర్లు వారి పనుల్లోనే నిమగ్నమై ఉన్నారు. దీంతో గ్రామాల ప్రధాన కూడళ్లలో హడావుడి ఎక్కడా కనిపించడం లేదు. ఎన్నికల పిచ్చాపాటి మాటలు వినిపించడం లేదు. అసలు ఎన్నికల సమయమేనా అనే సందేహం కలుగుతోంది. దీంతో ఏ పార్టీకి ఎంత బలం ఉంటుందనే అంచనా అంతు చిక్కడం లేదు. అభ్యర్థి ప్రచారానికి వచ్చిన సమయంలో పార్టీ కార్యకర్తలే రోడ్డెక్కుతున్నారు. ఏ పార్టీకీ మాటల్లో కూడా మద్దతు తెలపడం లేదు. ఈ విధానం చూస్తుంటే గప్‌చుప్‌గా ఓటు వేసే పరిస్థితి కనిపిస్తోంది.

కూల్‌గా ప్రచారం

గరుగుబిల్లి: ఎన్నికల పోలింగ్ సమయానికి కౌంట్‌డౌన్ మొదలైంది. దీంతో బరిలో నిలిచిన అభ్యర్థులు పోటా పోటీగా ప్రచారం చేస్తున్నారు. వారం రోజుల నుంచి ఉష్ణోగ్రతలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి. భానుడి ప్రతాపానికి పార్టీ నాయకులు, కేడర్ అల్లాడిపోతున్నారు. ఈ నేపథ్యంలో అభ్యర్థులు ప్రచార సరళి మార్చారు. గతంలో మాదిరిగా ఉదయం 9 నుంచి కాకుండా 7 గంటల నుంచే ఇంటింటి ప్రచారం మొదలు పెట్టేస్తున్నారు. 11 గంటలకే ముగించి.. మళ్లీ సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు కొనసాగిస్తున్నారు. బహిరంగ సభలు కూడా సాయంత్రం సమయంలోనే పెట్టుకుంటున్నారు. ఇక ప్రచారంలో ఖాళీ సమయం దొరికిందంటే పార్టీ కార్యాలయాల్లో సమావేశాలు, భవిష్యత్ వ్యూహాలపై చర్చిస్తున్నారు. అదే సమయంలో కొందరు పార్టీల్లో స్తబ్దుగా ఉంటున్న వారిని కలిసి వారిని తమవైపు తిప్పుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు ఎండ వేడికి భయపడి ప్రచారాలు ఎప్పుడు ముగుస్తాయా అని కేడర్ రోజులు లెక్క పెట్టుకుంటున్నారు. మొదటి విడతలోనే ఎన్నికలు జరిగి ఉంటే ఈ తిప్పలు తప్పేవని నాయకులు భావిస్తున్నారు.

ఉద్యమాల గడ్డ.. కురుపాం





కురుపాం నియోజకవర్గ ముఖచిత్రం

కోరన్న, మంగన్న స్థూపం

కురుపాం నియోజకవర్గం మ్యాప్

- దేశంలో అక్షరానికి ఆలయం ఉన్నది ఈ నియోజకవర్గంలోనే
- రెండో తిరుపతిగా పేరుగాంచిన తోటపల్లి దేవస్థానం ఇక్కడే

(జియ్యమ్మవలస)

కురుపాం నియోజకవర్గం 2009లో పునర్విభజనలో భాగంగా ఏర్పడింది. అంతకుముందు నాగూరు నియోజకవర్గంగా ఉండేది. ఎక్కువ సంవత్సరాలు శత్రుచర్ల వంశస్థులే ఈ నియోజకవర్గానికి ఎమ్మెల్యేలుగా ఉన్నారు. 1972లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో చంద్ర చూడామణిదేవ్ వైరిచర్ల ఇండిపెండెంట్‌గా పోటీ చేసి తన సమీప ప్రత్యర్థి శత్రుచర్ల ప్రతాపరుద్రరాజుపై 717 ఓట్ల తేడాతో గెలుపొందారు. తొలిసారి 1978లో ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచిన శత్రుచర్ల విజయరామరాజు.. ఆ తరువాత 1983, 1985, 1999లలోనూ ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆయన తమ్ముడు శత్రుచర్ల చంద్రశేఖరరాజు 1989లో ఎమ్మెల్యేగా గెలిచారు. తరువాత ఆయన మేనల్లుడు వీటీ జనార్దన్ థాట్రాజ్ 2009లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014, 2019లలో ఎమ్మెల్యేగా గెలుపొందిన పాముల పుష్పశ్రీవాణి... చంద్రశేఖరరాజు కోడలే. కురుపాం నియోజకవర్గాన్ని 37 సంవత్సరాల పాటు ఏలిన ఘనత శత్రుచర్ల కుటుంబానిదే. నాగూరు నియోజకవర్గంలో ఇక్కడి ఓటర్లు నాలుగుసార్లు కాంగ్రెస్‌కు పట్టం కట్టారు. కురుపాం నియోజకవర్గం ఆవిర్భావం తరువాత రెండుసార్లు వైసీపీ, ఓసారి టీడీపీ అభ్యర్థులు గెలుపొందారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో శత్రుచర్ల విజయరామరాజు మంత్రిగా పనిచేయగా.. వైసీపీ ప్రభుత్వంలో పాముల పుష్పశ్రీవాణి మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు.

పోరాటాల గెడ్డ

కురుపాం నియోజకవర్గం పోరాటాలకు పురిటి గెడ్డ. 1967లో మొండెంఖల్ వద్ద సభలో శ్రీకాకుళం గిరిజన రైతాంగ సాయుధ పోరాటం ఇక్కడి నుంచే ప్రారంభమైంది. ఆ పోరాట యోధులు వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం మాస్టారు ఈ ప్రాంతం వారే. వారి విగ్రహాలు కురుపాం మండలం గుమ్మ గ్రామం వద్ద భారీ స్థూపంతో ఏర్పాటు చేశారు. ఏటా గిరిజనులు అత్యధిక సంఖ్యలో హాజరై వారి వర్ధంతి రోజున ఘనంగా నివాళులర్పిస్తారు. అటవీ హక్కులన్నీ గిరిజనులకే చెందాలని వీరు పోరాటాన్ని కొనసాగించారు. ఆ పోరాటంలో 380 మంది కమ్యూనిస్టు కార్యకర్తలు పోలీసుల తూటాలకు బలయ్యారు. అంతేకాకుండా పార్వతీపురం కుట్ర కేసులో 450 మంది కమ్యూనిస్టు కార్యకర్తలు ఏడేళ్ల పాటు కోర్టుల చుట్టూ తిరుగుతూ ఐదేళ్ల పాటు శిక్ష అనుభవించారు. విడుదలైన తరువాత కూడా వీరు కమ్యూనిస్టు కార్యకర్తలుగానే కొనసాగారంటే దానికి వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం పోరాట పటిమే కారణం.

నాగూరు నియోజకవర్గంలో...

సం.	విజేత	పార్టీ	సమీప ప్రత్యర్థి	పార్టీ	మెజార్టీ
1972	వైరిచర్ల చంద్రచూడామణిదేవ్	ఇండిపెండెంట్	వైరిచర్ల ప్రతాపరుద్రరాజు	కాంగ్రెస్	717
1978	శత్రుచర్ల విజయరామరాజు	జనతా	వైరిచర్ల చంద్రచూడామణిదేవ్	కాంగ్రెస్	1,533
1983	శత్రుచర్ల విజయరామరాజు	కాంగ్రెస్	పువ్వల సోమందొర	సోషలిస్టు	623
1985	శత్రుచర్ల విజయరామరాజు	కాంగ్రెస్	వెంపటాపు భారతి	టీడీపీ	3,914
1989	శత్రుచర్ల చంద్రశేఖరరాజు	కాంగ్రెస్	వైరిచర్ల ప్రదీప్‌కుమార్‌దేవ్	టీడీపీ	3,435
1994	నిమ్మక జయరాజు	టీడీపీ	శత్రుచర్ల చంద్రశేఖరరాజు	కాంగ్రెస్	32,271
1999	శత్రుచర్ల విజయరామరాజు	కాంగ్రెస్	నిమ్మక జయరాజు	టీడీపీ	6,917
2004	కోలక లక్ష్మణమూర్తి	సీపీఎం	నిమ్మక జయరాజు	టీడీపీ	8,701

కురుపాం నియోజకవర్గంగా మారిన తర్వాత..

సం.	విజేత	పార్టీ	సమీప ప్రత్యర్థి	పార్టీ	మెజార్టీ
2009	వీటీ జనార్దన్ థాట్రాజ్	టీడీపీ	ఎస్.జయరాజు	ప్రజారాజ్యం	15,053
2014	పాముల పుష్పశ్రీవాణి	వైసీపీ	వీటీ జనార్దన్ థాట్రాజ్	టీడీపీ	19,083
2019	పాముల పుష్పశ్రీవాణి	వైసీపీ	వీటీ నరసింహప్రియ థాట్రాజ్	టీడీపీ	26,602

నియోజకవర్గంలో ఇలా..

మండలాలు : కొమరాడ
కురుపాం
గరుగుబిల్లి
గుమ్మలక్ష్మీపురం
జియ్యమ్మవలస
రిజర్వుడు : ఎస్టీ
పోలింగ్ కేంద్రాలు : 268
ఓటర్లు : 1,92,636
(2024 జనవరి 22 వరకు)
పురుషులు: 93,592
మహిళలు : 99,005
ఇతరులు : 39



తోటపల్లి బ్యారేజీ (ఫైల్)

చిన తిరుపతిగా తోటపల్లి

కురుపాం నియోజకవర్గంలో పర్యాటక ప్రదేశాలకు కొదువ లేదు. ఇందులో ప్రధానంగా చినతిరుపతిగా పేరొందిన తోటపల్లిలో శ్రీవేంకటేశ్వరస్వామి, కోదండరామ స్వామి ఆలయాలు అత్యంత పవిత్రమైనవి. నిత్యం పెద్ద సంఖ్యలో ఇక్కడికి భక్తులు తరలి వస్తుంటారు.


- గుమ్మలక్ష్మీపురం మండలం తాడికొండ వద్ద జలపాతాలు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. ఇక్కడికి ఎక్కువగా పర్యాటకులు వస్తూ ఉంటారు.
- తోటపల్లి బ్యారేజీలో బోటు షికారు పర్యాటకులకు ఓ మధురానుభూతి. పక్షుల కిలకిలలు, స్వచ్ఛమైన... ఆహ్లాదకరమైన పరిసరాలు పర్యాటకులను కట్టి పడేస్తుంటాయి.



తోటపల్లి దేవస్థానం ముఖద్వారం

అక్షర బ్రహ్మ ఆలయం


దేశంలో మరెక్కడా అక్షరానికి ఆలయం లేదు. కానీ గుమ్మలక్ష్మీపురం మండలం కన్నయ్యగూడ వద్ద గిరిజనులు అక్షర బ్రహ్మ ఆలయం నిర్మించారు. ఆనాడు సవర భాషను నేర్చుకుని గిరిజనులకు చదువు చెప్పాలనుకునే మహనీయుడు గిడుగు రామ్మూర్తి. ఆయన స్ఫూర్తితో 1993లో గుమ్మలక్ష్మీపురం మండలం కన్నయ్యగూడలో పాఠశాలను నిర్మించారు. తెలుగు మాధ్యమాలలో ఉన్న పాఠ్య పుస్తకాలను సవర భాషలోకి తర్జుమా చేసి ఆయన స్ఫూర్తితో సవర భాష గిరిజనులు అమ్మ భాషను అక్షర బ్రహ్మగా భావించి ఆలయాన్ని నిర్మించుకుని అక్కడ నిత్యం కొలుస్తుండటం విశేషం.



చంద్రచూడామణిదేవ్



శత్రుచర్ల విజయరామరాజు



శత్రుచర్ల చంద్రశేఖరరాజు



నిమ్మక జయరాజు



పాముల పుష్పశ్రీవాణి



వీటీ జనార్దన్ థాట్రాజ్



కోలక లక్ష్మణమూర్తి

ఈవీఎంలతో పర్యావరణ పరిరక్షణ

- చెట్లను కాపాడిన వైనం..

రాజాం రూరల్ : ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్)లేంటి?..పర్యావరణాన్ని పరిరక్షించడమేంటి? చెట్లను కాపాడడమేంటి?.. అనేదేగా మీ అనుమానం. మీరు చదివింది నిజమే. ఎన్నికలలో ఈవీఎంలను వినియోగించడం వల్ల పర్యావరణ పరిరక్షణ సాధ్యమైంది.. అదెలాగో చూడండి.

- 1999లో బ్యాలెట్ పత్రాల ముద్రణకు 7,700 టన్నుల కాగితం వాడారంట.. ఇది జరిగి పాతికేళ్లు గడచింది. పాతికేళ్లలో దేశంలో ఓటర్ల సంఖ్య కూడా భారీగా పెరిగింది. ఈ నేపథ్యంలో ఎన్నికలలో ఈవీఎంలను ప్రవేశపెట్టి ఉండకపోతే... బ్యాలెట్ పత్రాలను ఉపయోగిస్తే సుమారు 25వేల టన్నుల కాగితం అవసరమని నిపుణుల అంచనా..అంటే ఈ మేరకు కాగితం మిగిలినట్లే. ఈ కాగితం తయారీకి ఎన్ని వందల చెట్లు కొట్టేవారో...అంటే అవన్నీ బతికినట్టే కదా పర్యావరణాన్ని పరిరక్షించినట్టే కదా.

ఈవీఎంల ప్రవేశం ఇలా...

- 1982లో కేరళ రాష్ట్రంలోని పరూర్ శాసనసభ నియోజకవర్గంలో జరిగిన ఉప ఎన్నికలలో ఈవీఎంలను మొట్టమొదటిసారిగా ఉపయోగించారు.
- వీటిని భారత ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, ఎలక్ట్రానిక్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అనే రెండు ప్రభుత్వరంగ సంస్థలు తయారు చేశాయి.
- విద్యుత్ సరఫరా లేనిచోట కూడా ఇవి ఆల్కలైన్ బ్యాటరీతో పనిచేస్తాయి..
- ఒక్కో ఈవీఎం 3,840 ఓట్లను నిక్షిప్తం చేయగలదు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో 1400 ఓటర్లనే ఎన్నికల సంఘం అనుమతిస్తుంది.



పూల 'దండ'యాత్ర

- జోరందుకున్న వ్యాపారం



(గరుగుబిల్లి) ఎన్నికల పండుగ చిరు వ్యాపారులకు ఊతమిచ్చింది. నామినేషన్లు, ప్రచార ఘట్టంలో పూల వ్యాపారం జోరందుకుంది. ఇప్పటివరకు నామినేషన్లు దాఖలు చేయడానికి ర్యాలీగా వెళ్లిన నేతలకు పూల దండలు వేయడానికి అభిమానులు, కార్యకర్తలు ఎగబడ్డారు. ముందుగానే పూల దండలకు ఆర్డర్లు ఇచ్చి సిద్ధం చేసుకున్నారు. నామినేషన్ల ర్యాలీలు ముగియడంతో ప్రచారానికి వెళుతున్న అభ్యర్థులకు గ్రామాల్లో పూల దండలు వేసి అభిమానం చాటుకుంటున్నారు. ఇక జిల్లా స్థాయి నాయకులు వచ్చినా, పార్టీ అధినేతలు వచ్చినా కార్యకర్తలు పూల దండలు, గజమాలలు వేసి కేరింతలు కొడుతున్నారు. నామినేషన్ల ఘట్టం ముగియడంతో అభ్యర్థులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందిస్తున్నారు. నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో సైతం పూలకు ఒక్కసారిగా డిమాండ్ వచ్చింది. పువ్వులు సిద్ధం చేసి అమ్మడానికి ఎదురు చూసే పరిస్థితి లేకుండా వ్యాపారులకు ముందుగానే ఆర్డర్లు ఇచ్చి మరీ దండలు, పువ్వులు తెప్పించుకుంటున్నారు. ఎన్నికలు ముగిసే వరకు పూల వ్యాపారం జోరుగా సాగుతుందని వ్యాపారులు సంబర పడుతున్నారు. అమ్మకాలు పెరగడంతో స్వల్ప లాభానికే విక్రయిస్తున్నామని పలువురు చెబుతున్నారు. ఎన్నికలు ముగిసిన తరువాత విజయం సాధించిన వారి విజయోత్సవ ర్యాలీ వరకు తమకు వ్యాపారం బాగానే సాగుతుందని పూల వ్యాపారులు ఉత్సాహంగా ఉన్నారు.

హలో.. అక్కడ ఎవరు గెలుస్తారు?



గరుగుబిల్లి: 'హలో... మన దగ్గర ఎన్నికలు ఎలా జరుగుతున్నాయి? ఈసారి ఎవరు గెలుస్తారు? జిల్లాలో ఎన్ని సీట్లు వస్తాయ'ంటూ దేశ, విదేశాలు, పక్క జిల్లాల్లో ఉన్న బంధువులు, స్నేహితులు ఫోన్ల ద్వారా సమాచారాన్ని తెలుసుకుంటున్నారు. రోజులో ఏదో ఒక సమయంలో బంధువర్గాలకు ఫోన్ చేసి సమాచారం అడుగుతున్నారు. ఎక్కువగా తెలంగాణ నుంచి ఇలా ఫోన్లు వస్తున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉద్యోగాలు చేస్తూ అక్కడ స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న వారు జిల్లా రాజకీయాలపై ఆసక్తి చూపుతున్నారు. వీరితో పాటు ఉద్యోగం, చదువుల నిమిత్తం అమెరికాకు వెళ్లిన వారు కూడా గెలుపు, ఓటములపై ఆరా తీస్తున్నారు. ఇటు జిల్లా వాసులు కూడా పక్క జిల్లాలు, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో ఉన్న బంధువులు, స్నేహితులకు ఫోన్ చేసి అక్కడి రాజకీయ పరిస్థితులను అడిగి తెలుసుకుంటున్నారు. ఎన్నికలు మొదలైన దగ్గర నుంచి ఫోన్లలో రాజకీయాలపై ఆసక్తికరంగా చర్చించుకోవడం గమనార్హం.

భలే గిరాకీ

- ప్రచార సామగ్రికి డిమాండ్ ● తయారీదారులకు ఉపాధి

విజయనగరం (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు సమీపిస్తున్నకొద్దీ అభ్యర్థులు ప్రచారం ముమ్మరం చేస్తున్నారు. ఎన్నికల్లో గెలవాలంటే.. ముందుగా ప్రచారం హోరెత్తాలి. అలా జరగాలంటే అందుకు అవసరమైన వస్తు, వాహనాలను సమకూర్చుకోవాలి. ప్రత్యర్థిపై పైచేయి సాధించాలంటే అంతకుమించి ప్రచార ఆర్భాటం అవసరం. ప్రచారానికి అవసరమైన సామగ్రిని సంబంధిత వ్యక్తులు... సంస్థల నుంచి కొనుగోలు చేయడం.. అద్దెకు తీసుకోవడం పరిపాటి. వివిధ రకాల వస్తువులు... వాహనాలు... మైక్‌సెట్లు... డోర్ స్టిక్కర్లు, వాహనాల స్టిక్కర్లు, జెండాలు, బెలూన్, క్రాకర్స్ కండువాలకు ప్రస్తుతం విపరీతమైన డిమాండ్. తయారీదారులకు... అద్దెకు ఇచ్చేవారికి ఈ ఎన్నికల్లో చేతినిండా పని దొరుకుతోంది. దీంతో ఎంతో కొంత చేతికి అందుతోంది. ఈసారి పోలింగ్‌కు కాస్త సమయం ఎక్కువగా ఉండడం వీరికి కలసి వస్తోంది.



బెలూన్లతో కార్యకర్తల సందడి

ఎంపీగా ఒక్కసారే అవకాశం

విజయనగరం ప్రత్యేకత

విజయనగరం (ఆంధ్రజ్యోతి) నియోజకవర్గాల పునర్విభజన తరువాత నుంచి విజయనగరం ఎంపీగా ఒక్కసారే అభ్యర్థులకు అవకాశం ఇస్తున్నారు. ప్రతి లోక్‌సభ ఎన్నికల్లోనూ కొత్త ఎంపీని ఎన్నుకుంటున్నారు విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గ ఓటర్లు. గతంలో ఉన్న బొబ్బిలి పార్లమెంట్ స్థానం పునర్విభజనలో శ్రీకాకుళం- విజయనగరం జిల్లాలకు చెందిన అసెంబ్లీ సెగ్మెంట్లతో కలుపుకొని విజయనగరానికి మారింది. ఇందులో విజయనగరం, నెల్లిమర్ల, గజపతినగరం, ఎచ్చెర్ల, బొబ్బిలి, రాజాం, చీపురుపల్లి నియోజకవర్గాలు ఉన్నాయి. పార్లమెంటు స్థానం మారిన నాటి నుంచి ముగ్గురు అభ్యర్థులు పోటీ చేసి గెలిచారు. ఒకసారి గెలిచిన అభ్యర్థి మరోసారి పోటీలో ఉండటం లేదు. 2009లో మొదటిసారి జరిగిన ఎన్నికల్లో బొత్స ఝాన్సీ గెలుపొందారు. 2014లో అశోక్ గజపతిరాజు విజయం సాధించారు.. కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రిగా ఆయన బాధ్యతలు చేపట్టారు. 2019లో ఆయన ఓటమి చెందారు.. 2019 ఎన్నికల్లో బెల్లాన చంద్రశేఖర్ పోటీ చేసి విజయం సాధించారు. ప్రస్తుత ఎన్నికల్లో కూటమి తరపున కలిశెట్టి అప్పలనాయుడు, వైసీపీ నుంచి ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ బరిలో ఉన్నారు. మరి ఓటర్లు ఆనవాయితీని కొనసాగిస్తారో...కొత్త సంప్రదానికి తెరతీస్తారో చూడాలి.



అశోక్‌గజపతిరాజు



ఝాన్సీ



చంద్రశేఖర్



గంటస్తంభం

ఆ దారిలో ప్రయాణం.. నరకప్రాయం

- అర్ధాంతరంగా నిలిచిన రోడ్డు పనులు
- రాళ్లు తేలిన దారిలో ప్రయాణికుల అవస్థలు
- ఇదీ పాలమెట్ట వెళ్లే రహదారి దుస్థితి

వీరఘట్టం: ఆ దారిలో ప్రయాణం నరకాన్ని తలపిస్తుంది. బీటీ రోడ్డు నిర్మాణానికి పనులు చేపట్టినా సగంలోనే విడిచిపెట్టారు. దీంతో మరింత అధ్వానంగా తయారయ్యింది. రాళ్లు తేలిన దారిలో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇదీ పాలమెట్టకు వెళ్లే రహదారి పరిస్థితి. మండలంలోని పార్వతీపురం-పాలకొండ సీఎస్‌పీ రోడ్డు నుంచి పాలమెట్ట వరకు (వయా చిదిమి) బీటీ రోడ్డు నిర్మాణానికి 2023 అక్టోబరు 12న శంకుస్థాపన చేశారు. సుమారు రూ.1.2కోట్లు అంచనా వ్యయంతో రహదారి పనులు ప్రారంభించారు. కానీ కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. అసంపూర్తిగా రహదారి పనులు నిలిచిపోవడంతో ప్రయాణికులు వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డుపైన రాళ్లు తేలి ఉండడంతో ఆటోలు, ఇతర వాహనాలు యు.వెంకమ్మపేట రోడ్డు మీదుగా వీరఘట్టం, పాలకొండ వస్తున్నాయి. ఈ రహదారి పనులు త్వరగా పూర్తి చేయాలని చిదిమి, పాలమెట్ట గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బిల్లులు మంజూరు కాలేదు

ఈ రహదారి పనులకు సంబంధించిన బిల్లులు మంజూరు కాలేదు. దీంతో పనులు నిలిచిపోయాయి. నిధులు మంజూరైన వెంటనే రహదారి పనులు పూర్తి చేస్తాం.
- నాగభూషణం, జేఈ



రాళ్లు తేలిన రహదారిపై నడుస్తున్న మహిళలు

కుక్కల దాడిలో మరో ఇద్దరికి గాయాలు

- వరుస ఘటనలతో భయాందోళనలో జియ్యమ్మవలస మండలవాసులు



చికిత్స పొందుతున్న మహేశ్వరి

జియ్యమ్మవలస: మండలంలో మరోసారి కుక్కలు దాడికి తెగబడ్డాయి. గత రెండు నెలల్లో ఇదే మండలంలో 13మంది కుక్కకాటుకు గురయ్యారు. మళ్లీ శనివారం గవరమ్మపేట పంచాయతీ వెంకటరాజపురం గ్రామంలో ఇద్దరిపై వేర్వేరుగా కుక్కలు దాడి చేసి, తీవ్రంగా గాయపరిచాయి. గ్రామానికి చెందిన గొడబ సరోజని ఉదయం ఉపాధి పనులు ముగించుకుని ఇంటికి చేరుకున్న సరోజని బహిర్భూమికి అని ఇంటికి దగ్గర్లో ఉన్న మిరప తోటకు వెళ్లింది. ఇది చూసిన కుక్కలు ఆమెపై మెరుపు వేగంతో దాడి చేశాయి. ఈ దాడిలో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు చినమేరంగి లో ఉన్న సీహెచ్‌సీకి తీసుకువచ్చారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అక్కడ కూడా పరిస్థితి కొంత ఆందోళనకరంగానే ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. అలాగే అలజంగి మహేశ్వరి అనే డిగ్రీ విద్యార్థిని ఇంటి నుంచి బయటకు వస్తుండగా కుక్కలు దాడి చేసి, తీవ్రంగా గాయపరిచాయి. తల్లిదండ్రు లు ఆమెను చినమేరంగి సీహెచ్‌సీకి తరలించగా అక్కడి వైద్యులు చికిత్స అందించారు. వరుస ఘటనలతో పరిసర ప్రాంతాల ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. కుక్కలను శాశ్వతంగా నిర్మూలించాలని అధికారులను డిమాండ్ చేస్తున్నారు.

పదో తరగతి విద్యార్థి ఆత్మహత్య

పాలకొండ: మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన ఓ పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయని మనస్తాపానికి గురై ఆ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నట్టు గ్రామస్థులు తెలిపారు. శనివారం ఇంట్లో తల్లిదండ్రులు ఎవరూ లేని సమయంలో విద్యార్థిని ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్య సమస్యలపై అప్రమత్తంగా ఉండాలి

- డీఎంవో జగన్మోహన్‌రావు



సన్యాసిరాజుపేటలో అవగాహన కల్పిస్తున్న డీఎంవో

గరుగుబిల్లి: అధిక ఎండలు కారణంగా పలు ఆరోగ్య సమస్యలు తలెత్తే పరిస్థితి ఉందని, దీనిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి తెర్లి జగన్మోహన్‌రావు అన్నారు. మండలంలోని సన్యాసిరాజుపేట, పెదగుడబ, చినగుడబ గ్రామాల్లో ఆయన శనివారం పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్వర లక్షణాలు ఉన్నట్లయితే స్థానిక సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. వైద్య సిబ్బంది విధిగా జ్వరాలపై ఇంటింటి సర్వే నిర్వహించాలని ఆయన ఆదేశించారు. వేసవిలో తలెత్తే సమస్యలపై అవగాహన కల్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సచివాలయాల పరిధిలోని సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలందించాలన్నారు. ఈ కార్యక్రమంలో గరుగుబిల్లి వైద్యాధికారులు కేకే సాగర్‌వర్మ, ఎస్.సంతోష్‌కుమార్, ఈవో సత్తిబాబు, సిబ్బంది రమణమ్మ, ఇంద్రాణి, రమేష్, 104 సిబ్బంది పాల్గొన్నారు.

వెంకంపేటలో విజయచంద్ర ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న విజయచంద్ర

పార్వతీపురం రూరల్: మండలంలోని వెంకమ్మపేట పంచాయతీలో పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థి బోనెల విజయచంద్ర శనివారం ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలపై వివరించారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బోను దేవిచంద్రమౌళి, టీడీపీ నాయకులు చంద్రమౌళి, బార్నాల సీతారాం, గొట్టాపు వెంకటనాయుడు, జాగాన రవిశంకర్, జాగాన ధనుంజయ్ పాల్గొన్నారు.

టీడీపీ కౌన్సిలర్‌కు పరామర్శ

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: టీడీపీ కౌన్సిలర్ కె.నారాయణరావు బొబ్బిలి, పార్వతీపురం కూటమి అభ్యర్థులు బేబీనాయన, బోనెల విజయచంద్ర శనివారం పరామర్శించారు. ఇటీవల గుర్తు తెలియని వాహనం ఢీకొని గాయపడిన నారాయణరావు స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన్ని పరామర్శించి, త్వరగా కోలుకోవాలని వారు కోరారు. ఈ ప్రమాదం వెనుక ఏదో రాజకీయ కుట్ర ఉందని, పోలీసులు సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని, దర్యాప్తు చేస్తామని రూరల్ ఎస్ఐ దినకరన్ చెప్పారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

కొమరాడ: మండలంలోని కొమరాడ, విక్రంపురం గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పార్లమెంటరీ నియోజకవర్గ సాధారణ పరిశీలకుడు ప్రమోద్‌కుమార్ మెహర్ద శనివారం పరిశీలించారు. పోలింగ్ రోజున ఓటర్లకు ఎటువంటి అసౌకర్యాలు లేకుండా అన్ని చర్యలు చేపట్టాలని స్థానిక అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. పార్లమెంటరీ నియోజకవర్గ వ్యయ పరిశీలకుడు గుర్‌కరణ్‌సింగ్ మాట్లాడుతూ అభ్యర్థుల ప్రచారాన్ని నిశితంగా పరిశీలించాలన్నారు. ఈ పరిశీలనలో పాలకొండ ఆర్డీవో, కురుపాం ఆర్వో వి.వెంకటరమణ, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

- మండలంలోని ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న పోలింగ్ కేంద్రాలను పార్వతీపురం సీఐ రవికుమార్ శనివారం పరిశీలించారు. పోలింగ్ సమయానికి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పూడేసు, కొంతేసు, ఎండభద్ర, పెద్దశాఖ పోలింగ్ కేంద్రాలను కొమరాడ ఎస్ఐ నీలకంఠంతో కలిసి పరిశీలించారు.

పంచాయతీ కార్యదర్శులకు ఉపాధి బాధ్యతలు

గరుగుబిల్లి: పంచాయతీల పరిధిలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులు పరిశీలన బాధ్యతను పంచాయతీ కార్యదర్శులకు అప్పగించారు. ఈ మేరకు గొట్టివలసలో నిర్వహిస్తున్న పనులను పంచాయతీ కార్యదర్శి టి.భాస్కరరావు, సాంకేతిక సహాయకురాలు ఎం.ఉమామహేశ్వరి శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల పరిధిలోని వేతనదారుల పనులకు సంబంధించి ముందస్తు దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేస్తామని చెప్పారు. మస్తర్లలో వ్యత్యాసాలు ఉన్నట్లయితే చర్యలు తప్పవన్నారు. ఈ పరిశీలనలో క్షేత్ర సహాయకుడు నల్ల సూర్యనారాయణ ఉన్నారు.

ఎంటీఎస్ టీచర్లు తాత్కాలికంగా తొలగింపు

సాలూరు రూరల్: పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న 1998, 2008 డీఎస్సీల ఎంటీఎస్ ఉపాధ్యాయులను ఈనెల 30 నుంచి తాత్కాలికంగా విధుల నుంచి తొలగించాలని ఆదేశాలు వచ్చాయి. వారు గతేడాది ఏప్రిల్ 13న విధుల్లో చేరారు. గత మే నెలలో వారికి బ్రేక్ ఇచ్చి జూన్ 1 నుంచి మళ్లీ విధులోకి తీసుకున్నారు. ఈ ఏడాది కూడా ఈనెల 30 నుంచి తాత్కాలికంగా విధుల నుంచి తొలగించి, పాఠశాలలు పునః ప్రారంభం తర్వాత మళ్లీ ఎంటీఎస్ ప్రాతిపదికపై కాంట్రాక్ట్ పద్ధతిన తీసుకోనున్నారు. ● 1998, 2008 డీఎస్సీ టీచర్లుకు కేవలం సీఎంఆర్టీ (సీఆర్పీలు) వలే ఒక్క రోజే తొలగించి (సర్వీస్ బ్రేక్ ఇచ్చి) వెంటనే మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని ఏపీటీఎఫ్(257) జిల్లా అధ్యక్షుడు మర్రాపు మహేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లా బాలకృష్ణ డిమాండ్ చేశారు. వారిని 42 రోజుల పాటు తొలగించి వేతనమివ్వకుంటే ఎలా జీవిస్తారని ప్రశ్నించారు. ఇరు డీఎస్సీల టీచర్లకు ఒక్కరోజే సర్వీస్ బ్రేక్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒక్క రోజు మినహా 12 నెలలకు వారికి జీతాలివ్వాలని కోరారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి: జగదీశ్వరి



ప్రచారంలో మాట్లాడుతున్న జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని కూటమి కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ అన్నారు. మండలంలోని దుడ్డిగల్, బాలేసు గ్రామాల్లో శనివారం వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతిఒక్కరూ సైకిల్ గుర్తుపై ఓటు వేసి, తనను గెలిపించాలని జగదీశ్వరి కోరారు. వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ ప్రచారంలో టీడీపీ రాష్ట్ర తెలుగు మహిళా కార్యనిర్వాహక కార్యదర్శి బిడ్డిక పద్మావతి, జనసే నాయకులు కడ్రక మల్లేష్, బీజేపీ నాయకులు ఉమామహేశ్వరి కోలా రంజిత్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి టీడీపీ ప్రభుత్వం అవసరం

జియ్యమ్మవలస: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీ ప్రభుత్వం అత్యంత అవసరమని పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి దత్తి లక్ష్మణరావు, అరకు పార్లమెంటు నియోజకవర్గ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం టీఎన్ వలస, కుందర తిరువాడ, ఇటిక పంచాయతీల్లో వారు ప్రచారం నిర్వహించారు. కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరిని, అరకు పార్లమెంటు అభ్యర్థి కొత్తపల్లి గీతను గెలిపించాలన్నారు. ఎంపీపీ బొంగు సురేష్, ఎన్.కృష్ణబాబు, శంకరరావు, తదితరులు పాల్గొన్నారు. ● **గరుగుబిల్లి:** కూటమి అభ్యర్థి తోయక జగదీశ్వరికి మద్దతుగా కొత్తూరులో శనివారం టీడీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు అక్కేన మధుసూదనరావు ఆధ్వర్యంలో ద్వారపురెడ్డి సత్యనారాయణ, మరడాన తవిటినాయుడు, మర్రాపు పురుషోత్తంనాయుడు, తవిటినాయుడు, భరత్‌కుమార్, ముదిలిబాబు విజయవాంకుశం, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

కురుపాం: కురుపాం పంచాయతీ చెరువుకొమ్మువలస 14వ వార్డు మెంబర్ కందుల బాలకృష్ణ ఆధ్వర్యంలో 40 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీ చేరాయి. వీరంతా శనివారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్‌కుమార్, టీడీపీ మండ ల కన్వీనర్ కేవీ కొండయ్య, మాజీ ఎంపీపీ జీవీ రమణమూర్తి, కర్రి శ్రీనివాసరావు, మంతిని త్రిపురనాథ్, టీడీపీ నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి: జయకృష్ణ



కడగండిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న జయకృష్ణ

సీతంపేట: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తనకు ఒక్క అవకాశం ఇచ్చి గెలిపించాలని కూటమి పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మక జయకృష్ణ కోరారు. మండలంలోని గడబవలస, కొత్తవలస, దేవగిరి, పెద్దవంగర, గజిలి, కడగండి, ఓంద్రుజోల గ్రామాల్లో ఆయన శనివారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో నెంబర్3, జీవో నెంబర్ 52లకు ఎందుకు మౌనం వహిస్తున్నారో ఓటర్లు గ్రహించాలన్నారు. గిరిజన సమస్యలు కోసం అసెంబ్లీలో ప్రస్తావించే వ్యక్తిగా తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు సవర తోటముఖలింగం, సీనియర్ నాయకులు నిమ్మక నాగేశ్వరరావు, నిమ్మక చం ద్రశేఖర్, ప్రచారకర్త తోయక సంధ్యారాణి, నిమ్మక మురళి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నేడు వీరఘట్టంలో ప్రచారం

వీరఘట్టం: మండలంలో కూటమి అభ్యర్థి నిమ్మక జయకృష్ణ ఆదివారం ప్రచారం చేయనున్నారు. మండలంలోని ఎస్.గోపాలపురం, జె.గోపాలరావు, మూలలంక, గాదిలంక, పెద్దూరు, చిన్నగోర, చిన్నగోర కాలనీల్లో ప్రచారం చేయనున్నట్టు టీడీపీ మండల అధ్యక్షుడు ఉదయాన ఉదయ్‌భాస్కర్ శనివారం తెలిపారు.

వచ్చేది కూటమి ప్రభుత్వమే: సంధ్యారాణి

పాచిపెంట: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రావడం ఖాయమని, ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే రోడ్లు వేయిస్తానని సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి భరోసా ఇచ్చారు. శనివారం కర్రివలసలో టీడీపీ మండల అధ్యక్షుడు పిన్నింటి ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో ఆమె ప్రచారం నిర్వహించారు. ఉపాధి పనుల వద్దకు వెళ్లి వేతనదారులతో మాట్లాడారు. ప్రతి గ్రామానికి రోడ్డుతో పాటు ఆ గ్రామంలోగల అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని ఆమె భరోసా ఇచ్చారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు. ● **సాలూరు రూరల్:** తాను గెలిచిన వెంటనే సాలూరు నియోజకవర్గ అభివృద్ధి ఏమిటో చేసి చూపిస్తానని కూటమి అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. ఆమె కూర్మరాజుపేట, పుణికిలవలస, చిన్నవలస గ్రామాల్లో శనివారం ప్రచారం నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఆముదాల పరమేశు, సర్పంచ్ నళిని తదితరులు పాల్గొన్నారు.

ఒకటో తేదీనే పింఛన్లు అందించాలి

- చార్జిషీట్ విడుదల చేసిన ఎన్డీఏ కూటమి



సాలూరు: జగనాసుర రక్త చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సంధ్యారాణి



పాలకొండ: చార్జిషీట్ పత్రాలను ప్రదర్శిస్తున్న కూటమి నాయకులు

పాలకొండ: వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలు, అరాచకాలపై టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి శనివారం చార్జిషీట్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా పాలకొండలో కూటమి నాయకులు ర్యాలీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 1వ తేదీనే ఇంటి వద్దకే పింఛన్లు అందించాలని డిమాండ్ చేశారు. పంచాయతీలు, మున్సిపాలిటీలకు చెందిన నిధులు సుమారు రూ.12వేల కోట్లును దారి మళ్లించారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం ప్రజలను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేసిందన్నారు. కూటమి నాయకులు పడాల భూదేవి, పూడి తిరుపతిరావు, గండి రామినాయుడు, సామంతుల దామోదరరావు, అంగూరు దశరధనాయుడు, బి.జయలక్ష్మీ, సవర కుంపి, కోట సంగంనాయుడు, కొత్తకోట రాజారావు, కొత్తకోట గోవిందరావు, మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు. ● **సాలూరు:** పింఛన్‌దారులకు వచ్చేనెల ఒకటో తేదీన వారి ఇళ్లకు వెళ్లి పింఛన్ ఇవ్వాలని కూటమి సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి డిమాండ్ చేశారు. సాలూరులోని తన నివాసంలో శనివారం ఆమె స్థానిక విలేకర్లతో సమావేశం నిర్వహించారు. ముందుగా జగనాసుర రక్తచరిత్ర అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డిని నమ్మి ప్రజలు ఓసారి వైసీపీకి ఓటు వేస్తే రాష్ట్రం మూడు దశాబ్దాల అభివృద్ధిలో వెనక్కి పోయిందని అన్నారు. పింఛన్‌దారులకు ఒకటో తేదీ నాడు నేరుగా వారి ఇళ్లకు వెళ్లి పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు ఏర్పాట్లు

పాలకొండ: వచ్చే నెల 5 నుంచి 9 వరకు జరిగే పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేయాలని పాలకొండ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి శుభం బన్సల్ ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కోసం శనివారం పాలకొండ హైస్కూల్ ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆర్వో మాట్లాడుతూ.. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సమయంలో ఎన్నికల అధికారులు, సిబ్బందికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ఎండ నుంచి రక్షణ కలిగేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. మండలం వారీగా కౌంటర్లు సిద్ధం చేయాలన్నారు. ఈ పరిశీలనలో సీఐ, తహసీల్దార్లు, డీటీలు, ఇతర ఎన్నికల సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

● **సీతంపేట:** పాలకొండ నియోజకవర్గంలోని ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు ఇస్తున్న ఎన్నికల శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గ ఆర్వో శుభం బన్సల్ అన్నారు. శనివారం స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ ఎన్నికల శిక్షణా తరగ తుల్లో ఏమైనా సందేహాలుంటే ఇప్పుడే నివృత్తి చేసుకోవాలని తెలిపారు.

రేగులగూడ బ్రిడ్జి సకాలంలో పూర్తి చేయండి

సీతంపేట: ఐటీడీఏ పరిధిలో గిరిజన ఇంజనీరింగ్ శాఖ ద్వారా చేపడుతున్న పలు అభివృద్ధి పనులను ఆ శాఖ చీఫ్ ఇంజనీర్ ఎస్.శ్రీనివాస్ శనివారం పరిశీలించారు. రేగులగూడ గెడ్డ వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులను, గోకుల షెడ్లను పరిశీలించి, వాటిని సకాలంలో పూర్తి చేయాలన్నారు. అర్ధాంతరంగా నిలిచిన రహదారి పనులను నాణ్యతలో రాజీ లేకుండా సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఏకలవ్య మోడల్ స్కూల్‌ను ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులు వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లతో సమావేశం నిర్వహించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సింహాచలం, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కృష్ణకుమార్ పాల్గొన్నారు.

ప్రకృతి సాగు అమలు తీరుపై పరిశీలన

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని రాయగడ, జమ్ము పంచాయతీల్లోగల రాయగడ, జమ్ము, గొరడ, పెంగవ, వల్లాడ గ్రామాల్లో నాబార్డు సహకారంతో జట్టు ట్రస్టు ద్వారా అమలు చేస్తున్న జీవా కార్యక్రమ అమలు తీరును అసిస్టెంట్ మేనేజర్ డా.రేఖ, ఎం.గోనాల్ శనివారం పరిశీలించారు. రైతులు అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ విధానాలు చూసి అభినందించారు. నాబార్డు డీడీఎం టి.నాగార్జున, వాసస్ సంస్థ అసోసియేట్ డైరక్టర్ డా.ఎంఎల్ సన్యాసిరావు, జట్టు ట్రస్టు ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ ప్రాహరాజ్, ప్రాజెక్టు కమిటీ చైర్మన్ తాడంగి జమ్మయ్య ఉన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు

పాలకొండ: ఎన్నికల నేపథ్యంలో బార్ అండ్ రెస్టారెంట్ యజమానులు ఎన్నికల నియమావళిని పాటించాలని జిల్లా ఎన్నికల స్క్వాడ్ బృందం ఆదేశించింది. పట్టణంలోని శ్రీకోటదుర్గ బార్ అండ్ రెస్టారెంట్‌ను వారు శనివారం తనిఖీ చేశారు. అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం ధరల పట్టికను తప్పనిసరిగా ఉంచేలా ఎస్ఈబీ అధికారులకు ఆదేశించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మండల సమావేశం వాయిదా

మక్కువ: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం నిర్వహించాల్సిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడినట్టు ఎంపీడీవో పి.దేవ కుమార్ తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రజా ప్రతినిధులు తక్కువ సంఖ్యలో హాజరు కావడంపై సమావేశం వాయిదా వేశామని చెప్పారు.

'అభివృద్ధికి కట్టుబడి ఉంటా'

ఒడిశా

రాయగడ: కొరాపుట్ పార్లమెంటు నియోజక వర్గ అభివృద్ధికి కట్టుబడి ఉంటానని, ఈ ఐదేళ్లలో కొరాపుట్, రాయగడ జిల్లాల అభివృద్ధికి ఎంతో కృషి చేశానని ఎంపీ సప్తగిరి శంకర ఉలకా అన్నారు. ఈ మేరకు తన నివాసంలో శనివారం ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావే శంలో వివరాలను వెల్లడించారు. ఈ ఐదేళ్లలో తన ఎంపీ నిధులు రూ.19కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు ఖర్చు చేసినట్టు తెలిపా రు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్ పండా, ఉపాధ్యక్షుడు సంకర్షణ మంగరాజ్, శాసన సభ అభ్యర్థి అప్పలస్వామి కడ్రక కార్యకర్తలు పాల్గొన్నారు.





ఆంధ్రజ్యోతి
మా అక్షరం - మీ ఆయుధం
ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా, పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ నెంబర్లకు సంప్రదించగలరు.
ACM : 9985411514, విజయనగరం : 9985411533
పార్వతీపురం : 9985403035, సాలూరు : 9492900300

ANDHRA JYOTHI CLASSIFIEDS
ఆంధ్రజ్యోతి

అమ్మబడును

★ విజయనగరం సిటీలో గంట స్తంభం నుంచి 2 కిలోమీటర్ల దూరంలో కేవలం 30లక్షలకు ఇండివిద్యుల్ లగ్జరీ డబల్ బెడ్ రూమ్ ఇల్లు సకల సౌకర్యాలతో 130 గజాలు 900SFT వివరాలకు సంప్ర: 9143143818
AJS

అద్దె/లీజు కొరకు

★ పాలకొండలోగల మూడు డాక్టర్ సి.ఎల్. నాయుడు కళ్యాణ మండపాలు ఏసీ రూమ్స్‌తో సహా అద్దె/లీజు కొరకు కలవు. కావలసినవాళ్లు సంప్రదించగలరు. కాంట్రాక్ట్ నెంబర్: 9440631123
AJS

ఆంధ్రజ్యోతి
అచిరకాలంలో అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా! అయితే దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లలో ఏ నెంబరుకైనా ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం వచ్చి మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు, పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు.
ఫోన్ నెంబర్లు : ACM : 99854 11514
ACO : 99854 11533
Office : 08942 - 281995

ప్లాట్లు కొనబడును

★ హైదరాబాద్, హయత్‌నగర్, అంబర్పేట్, కోహెడ, మెట్టు, మల్కాపూర్, తూప్రాన్‌పేట్ పసుమాముల, విలేజ్‌లో ప్లాట్లు కొనబడును. సంప్ర: 9346307356 AJH-002360

అద్దె/అమ్మకం కొరకు

★ పాలకొండలో ఉన్న డాక్టర్ సి.ఎల్. నాయుడు కళ్యాణ మండపాలకు ఆనుకుని ఒక్కొక్క అంతస్తు 9000 చదరపు అడుగులు చొప్పున ఉన్న 3అంతస్తుల భవనం బ్యాంకులు, ఆఫీసులు, వాణిజ్యపరమైన అవసరాలకు అద్దె/అమ్మకమునకు కలదు. కావలసిన వాళ్లు సంప్రదించగలరు. కాంట్రాక్ట్ నెంబర్: 9440631123
AJS

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించాల్సిన నెంబర్లు: 9985411522, 9985479944, 9985406982, 9440567403, 9985489266